క్లుప్తంగా

రచయితల సందేశాలు సమాజానికి మేలుకొలుపు


విద్యార్థులతో మాట్లాడుతున్న లైబ్రేరియన్ మద్దమ్మ

పగిడ్యాల: రచయితల సందేశాలు సమాజానికి మేలుకొలుపునకు దోహదం చేస్తాయని లైబ్రేరియన్ మద్దమ్మ తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ వీరేశలింగం పంతులు రచించిన కన్యాశుల్కం ఎంతో ప్రసిద్ధిగాంచిందని గుర్తు చేశారు. పూర్వ రాజులు తమ ఆస్థానంలో కవులకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి సాహిత్యానికి పెద్దపీట వేశారని వివరించారు. అదేవిధంగా క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పాత నేరస్తులపై ప్రత్యే నిఘా ఉంటుందని, సమాజంలో గౌరవప్రదంగా జీవించడం అలవర్చుకోవాలన్నారు. భార్యా, పిల్లల జీవితాలను దృష్టిలో పెట్టుకొని నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలిగే వారి వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి రౌడీషీట్ తొలగించేందుకు ప్రయత్నిస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు.

ఒకే నంబర్ టికెట్లపై కమిషనర్ ఆరా !

మహానంది: మహానంది దేవస్థానంలో టికెట్ల జారీలో గోల్‌మాల్ జరిగిందన్న విషయంపై దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సత్యనారాయణ ఆరా తీసినట్లు సమాచారం. ఒకే నంబరుతో రెండేసి చొప్పున టికెట్లు వచ్చినట్లు ఆదివారం ప్రచారం జరిగింది. అయితే గోల్‌మాల్, ఎలాంటి అవినీతి జరగలేదని ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ నెల 9వ తేదీన, 12వ తేదీన ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లలో సాంకేతిక కారణాలు తలెత్తడంతో కంప్యూటర్ల ద్వారా కాకుండా పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారన్నారు. అలా టికెట్లు జారీ చేసే సమయంలో సాంకేతిక లోపాలతో ఒకే నంబరుతో ఒకే సమయంలో రెండేసి చొప్పున టికెట్లు వచ్చాయన్నారు.

శ్రీశైలంలో భక్తులకు విస్తృత సేవలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత సేవ లు అందిస్తున్నామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా శ్రీశైలంలో పోలీ సు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. హోంగార్డు నుంచి డీఎస్పీ స్థాయి వరకు ఒక టీంగా విధులు నిర్వహించి ఎలాంటి అవాంతరాలు లేకుండా కార్తీకపౌర్ణమి ఉత్సవాలను విజయవంతం చేశామన్నారు. భక్తులకు, వాహనదారులకు అంతరాయం లేకుండా 10 బ్లూకోర్ట్ వాహనాలు, 4 రక్షక్ పెట్రోలింగ్, రెండు టోయింగ్ వాహనాలు, కమాండ్ కంట్రోల్‌రూం, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతూ ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నామని చెప్పారు. అలాగే హైదరాబాద్–విజయవాడ రహదారుల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా తగుచర్యలు చేపట్టామన్నారు. కార్తీకమాసమంతా పోలీసు బందోబస్త్ కొనసాగుతుందని తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి చెందిన టోల్‌గేట్ వద్ద పెను ప్రమాదం తప్పింది. ఆదివారం కాకినాడకు చెందిన 38 మంది భక్తులు ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో శ్రీశైలం వస్తుండగా దేవస్థాన టోల్‌గేట్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న భక్తులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు.

ఎత్తిపోయిన పథకం


మల్యాల ఎత్తిపోతల పథకం


రబీ సీజన్‌లో పంట వేయకుండా వదిలేసిన భూమి

- నిరుపయోగంగా మారిన మల్యాల ఎత్తిపోతల పథకం ఫేజ్–1
- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగు నెలలైనా పట్టించుకోని ప్రభుత్వం
- ఎండుతున్న మినుములు, కంది పంటలు
- ఆందోళనలో రైతన్నలు

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎత్తిపోతల పథకాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. రూ.కోట్ల ప్రజాధనంతో నిర్మించిన మల్యాల ఫేజ్–1 (నాగటూరు) పథకంలో నీరు అందుబాటులోవున్నా నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. నాలుగు నెలల క్రితం విద్యుత్ డీప్ (ట్రాన్స్‌ఫార్మర్) కాలిపోయి మరమ్మతుల కోసం ఎదురుచూస్తోంది. నీటి పారుదల లేక పథకం పరిధిలో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తే సాగునీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

పథకం పరిధిలో 4,900 ఎకరాలు

నందికొట్కూరు మండలంలో మల్యాల ఫేజ్–1 ఎత్తిపోతల పథకం రూ.1,536 లక్షలతో నిర్మించారు. 4,900 ఎకరాలకు సాగు నీరందించడానికి మహానేత వైఎస్సార్ 2008లో జలయజ్ఞం పథకం కింద రూపకల్పన చేసి నిర్మించారు. కాంగ్రెస్ పాలనలో 2012లో డిసెంబర్ 2న దీనిని ప్రారంభించారు. ఫేజ్–2 ఎత్తిపోతల పథకం 2016 సెప్టెంబరు నెలలో ప్రారంభించారు. ఫేజ్–1 పథకం కింద ఆయకట్టు 4900 ఎకరాలు, రైతులు 1400 మంది రైతులు ఉన్నారు. నాగటూరు–1000, కొణిదేల–370, పగిడ్యాల–930, లక్ష్మాపురం–2000, మండ్లెం–600 ఎకరాల భూమి ఉంది.

ఎండుతున్న పంటలు

ఫేజ్ –1 పథకానికి సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయాయి. ఒక ట్రాన్స్‌ఫార్మర్ నాలుగు నెలల క్రితం మరమ్మతులకు గురైతే, మరొకటి రెండు నెలల క్రితం కాలిపోయింది. దీంతో పథకానికి నీరు పారక సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ఖరీఫ్, రబీ సీజన్‌లో మినుము, కంది, మొక్కజొన్న పంటలకు సాగునీరు అందక రైతులకు తీరని నష్టం మిగిలిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన కంది పంట పూత దశ చేరుకుంది. అయితే నీరు అందక పూత, పిందె రాలిపోతుండగా, రబీ సీజన్‌లో వేసిన మినుము పంటకు వాడుదశకు చేరింది. ఫేజ్–1 కింద రబీ సీజనల్‌లో విత్తనాలు వేసేందుకు రైతులు భూములను సిద్ధం చేసుకోగా.. సాగునీరందక విత్తు వేయలేక అలాగే వదిలేశారు.


సాగునీరందక పూత రాలిపోతున్న కందిపంట

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



మల్యాల ఎత్తిపోతల పథకం ఫేజ్–1 కింద రెండు ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయిన కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. ఖరీఫ్‌లో వేసిన కంది పంట సాగునీరు అందక పూత రాలిపోతుంది. రబీ సీజనల్‌లో వేసిన మినుము ఎండిపోతోంది. ప్రభుత్వం స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయించి పంటలను కాపాడాలి. – వెంకటేశ్వర్లు, సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకుడు

కాలయాపన చేస్తున్నారు

మల్యాల ఫేజ్–1 ఎత్తిపోతల పథకం కింద వేసిన పంటలు సాగునీరందక ఎండు దశకు చేరుకున్నారు. రెండు డీప్‌లు ఉంటే ఒక డీప్ నాలుగు నెలల క్రితం, మరోక డీప్ చెడిపోయి నెలన్నర అయ్యింది. ఈ రోజు, ఆ రోజు అంటూ మరమ్మతులు చేయడంలో జాప్యం చేయడంతో మినుము పంట వాడుపడుతుంది. వారం రోజులు గడిస్తే పంట ఎండిపోవడంతో రైతులు తీవ్ర నష్టం జరుగుతుంది. – ప్రవీణ్, రైతు, బిజినవేముల

పది రోజుల్లో రైతులకు సాగునీరు అందిస్తాం

మల్యాల ఫేజ్–1 కింద వేసిన పంటలకు పది రోజుల్లో సాగునీరు ఇస్తాం. రెండు ట్రాన్స్‌ఫ్మార్లు మరమ్మతులు రైతులే చేయించుకుంటున్నారు. నాలుగు నెలల క్రితం ఒకటి చెడిపోయింది. 45 రోజుల క్రితం మరోకటి చెడిపోయింది. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతుల గురించి నివేదిక పంపడం జరిగింది. – నారాయణరెడ్డి, ఏఈ, మల్యాల ఎత్తిపోతల పథకం

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నీటివిడుదల తగ్గింపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కేవలం ఆరువేల క్యూసెక్కులను ఎస్సార్బీసీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీశైలం జలాశయంలో 875.10అడుగుల నీటి మట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 874.10అడుగుల నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు.

నిప్పులవాగుకు 779క్యూసెక్కులు

లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 779క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల డ్యామ్ నుంచి కేసీ కాల్వకు 2,200క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,344క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు.

తెలుగుంగకు నాలుగువేల క్యూసెక్కుల నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి తెలుగుగంగకు(వీబీఆర్) 4,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర ఆదివారం తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 6,000 క్యూసెక్కులు ఎస్ఆర్ఎంసీ ద్వారా బాకనచెర్ల క్రాస్ రెగ్యులేటరు వద్దకు చేరుతున్నాయన్నారు.

నేడు శ్రీశైలం ఈఓ బాధ్యతల స్వీకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా నియమితులైన ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు దేవస్థాన అధికార వర్గాలు తెలిపారు. ప్రస్తుతం ఆజాద్ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2014లో ఆజాద్ శ్రీశైలం ఈఓగా విధులు నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి


మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో గిరిజన సంఘాల నాయకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దర్శించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రికి దేవస్థాన అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో మంత్రికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. శ్రీశైలం వచ్చిన మంత్రిని భ్రమరాంబా అతిధిగృహం వద్ద స్థానిక చెంచు, గిరిజన సంఘాల నాయకులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు.

పైరును దున్నేశాడు..!

పాములపాడు: రహదారి వెంట భారీ వాహనాల రాకపోకులు రైతుకు శాపంగా మారాయి. పైరు పెరుగుదల కొరవడటంతో పంట చేతికొచ్చే అవకాశం లేన్నందున మినుము పైరును ఆదిలోనే దున్నేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలోని చెలిమిల్ల గ్రామానికి చెందిన రైతు లచ్చలగౌడు ఐదు ఎకరాల్లో మినుము పైరు సాగు చేశాడు. పొలం ప్రధాన రహదారి ప్రక్కనే ఉంది. నేషనల్‌హైవే పనుల నిమిత్తం భారీ వాహనాలు ఈ రహదారి గుండా ప్రతి రోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనాల రాకపోకల మూలంగా దుమ్ము పైరుపై పడుతుంది. విత్తనం విత్తి 25 రోజులు గడిచినా పైరులో ఎదుగుదల కనిపించలేదు. దీంతో అసహనానికి గురైన ఆ రైతు పైరును దున్నేశాడు. ఎకరాకు దాదాపు రూ.20వేలు నష్టం వాటిల్లిందని బాధితరైతు లచ్చన్న గౌడ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. మరో పంట సాగు చేద్దామంటే రాకాసిలా ఉన్న దుమ్ము వల్ల నష్టమే తప్ప ఎలాంటి ఫలితం ఉండదంటున్నాడు. రహదారి వెంట ఉన్న పంట పొలాలకు ఇదే దుస్థితి ఉందన్నాడు. అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని ప్రత్యామ్నాయం చూపకపోతే ప్రతి రైతు లక్షల్లో నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు.


మినుము పైరును ట్రాక్టర్‌తో దున్నేస్తున్న దృశ్యం

మహానందిలో సండే సందడి


మహానందీశ్వరస్వామి దర్శనార్థం వేచి ఉన్న భక్తజనం

మహానంది: కార్తీకమాసం, ఆదివారం సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, శ్రీనివాసప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం వేళలో దర్శనానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక డొనేషన్ కౌంటర్ వద్ద పాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ నిర్విరామంగా కొనసాగింది.

23న కార్తీక వనభోజన మహోత్సవ రాష్ట్ర మహాసభ


కర పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఈనెల 23వ తేదీన కర్నూలులో హలో బీసీ చలో కర్నూలు కార్తీక వనభోజన మహోత్సవ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల బీసీ సోదర సోదరీమణులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు డబ్బి వెంకటస్వామిగౌడ్, గౌరవాధ్యక్షులు బి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మన్నెం బాలస్వామియాదవ్, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో ఆర్‌అండ్‌బీ సీఈ పూజలు


సీఈ బుచ్చిరాజుకు జ్ఞాపిక అందిస్తున్న అధికారులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రహదారులు, భవనాల శాఖ ఎలక్ట్రికల్ విభాగం సీఈ బుచ్చిరాజు ఆదివారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు, స్వామివారి మెమోంటో అందించి వేదాశీర్వచనం చేశారు. వారి వెంట ఈఈ ఝాన్సీరాణి, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి


పలకవీటి విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణులు

ఆత్మకూరు: త్యాగరాజ స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పలకవీటి విజయ్ కుమార్‌ను నాయీ బ్రాహ్మణ సేవాసంఘం సీనియర్ నాయకులు కోరారు. ఆదివారం ఆయన ఆత్మకూరుకు రాగా సేవాసంఘం సీనియర్ నాయకులు రామకృష్ణుడు, అధ్యక్షులు పగిడ్యాల శివ పాములేటి, కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. నాయీ బ్రాహ్మణ భవనంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు ఎం.పెద్దస్వాములు, యల్లప్ప, రుద్రప్రసాద్, బోధనం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆత్మకూరు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్‌హాల్‌లో సీపీఎం పట్టణ కమిటీ సమావేశాన్ని పట్టణ కమిటీ నాయకులు డి.రామ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఎ.రణధీర్ మాట్లాడుతూ పేదలకు సెంటున్నర స్థలం ఇస్తామంటున్నారని, గతంలో మూడు సెంట్లు ఇచ్చారన్నారు. ఇప్పుడు రెండు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, మంజుల, సద్దాం, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

నందికొట్కూరు: కాంప్లెక్స్, దుకాణాలకు, గృహాలకు స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రజలపై భారం వేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని సీపీఐ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని అమర్చిన స్మార్ట్ మీటర్లను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను బిగిస్తే అడ్డుకుంటాం, ధ్వంసం చేస్తాం, అవసరమైతే తగలబెడతామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు చెప్పి, గద్దెనెక్కాక చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 30 శాతం విద్యుత్ భారం తగ్గిస్తామని చెప్పిన హామీని విస్మరించి భారం మోపేందుకు పూనుకోవడం సమంజసం కాదని హెచ్చరించారు.

శ్రీశైలం దేవస్థానం ఈఈగా బాలమురళీకృష్ణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పి.బాలమురళీకృష్ణను నియమిస్తూ దేవదాయశాఖ అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్ల దేవస్థానంలో ఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఒక సంవత్సరం డిప్యూటేషన్‌పై శ్రీశైల దేవస్థానానికి బదిలీ చేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కనుల పండువగా లక్ష దీపారాధన

ఆత్మకూరు: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో వెలిసిన శ్రీ వీరాంజనేయ, శివాలయాల్లో ఆదివారం రాత్రి లక్ష దీపారాధన, జ్వాలాతోరణం కనుల పండువగా సాగింది. ఆలయ ప్రధానాచార్యకుల ఆధ్వర్యంలో లక్ష దీపాలు, జ్వాలాతోరణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో వెలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి ఆకుపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రమబద్ధీకరించాలి

నంద్యాల(న్యూటౌన్) : కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజేషన్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జిల్లా అసోసియేషన్ ఐక్యవేదిక జేఏసీ చైర్మన్ కిశోర్ కుమార్, కో చైర్మన్ నాగమురళీ మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ మహిళా కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. అనంతరం జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ప్రకృతి ఒడిలో సమావేశ మందిరం


బైర్లూటిలోని నల్లమల ఎరీనా మినీ కాన్ఫరెన్స్ హాల్


కాన్ఫరెన్స్ హాల్‌లో వేదిక

ఆత్మకూరురూరల్: చుట్టు పచ్చటి ప్రకృతి.. ఎత్తైన చెట్లు .. ఆ చెట్ల కొమ్మలపై లాంగ్ జంప్‌లు చేసే బెట్టుడుతలు ఆ చుట్టుపక్కలే తిరుగాడే పొదదుప్పులు... ఈ వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. అలాంటి చోట ఓ యాభైమంది చేరి మాట్లాడుకుంటే అది ఇంక ఎంత బాగుంటుందో కదా. అలాంటి అవకాశాన్ని అటవీ శాఖ కల్పిస్తోంది. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో బైర్లూటిలో ఉన్న ఎకో టూరిజం రిసార్ట్ (నల్లమలై జంగిల్ క్యాంప్)లో ఒక అత్యాధునిక మినీ కాన్ఫరెన్స్ హాల్‌ను నిర్మించారు. 50 మంది కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ ఏసీ హాల్ చిన్నచిన్న సమావేశాలకు చక్కగా ఉపయోగ పడుతుంది. చక్కటి ఫర్నీచర్, సొగసైన ఫ్లోరింగ్, పక్కనే భోజనాలు చేసేందుకు వసతి కలిగి ఉంది. ఇంకా ఈ హాల్ కు బాడుగ నిర్ణయించలేదు. చిన్న పాటి పనులు పూర్తి చేసి త్వరలో దీనిని అందుబాటులోకి తేస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

కాలం కాని కాలంలో..


మార్కెట్లో తోతాపురి మామిడి కాయలు

ఆత్మకూరురూరల్: వేసవికాలం అంటేనే గండు కోయిలల మధుర గానానికి, మల్లెల సౌరభానికి, మామిడి పండ్ల తీయ్యందానికి పెట్టింది పేరు. అది కాలమహిమ. కానీ వేసవిలో కనిపించాల్సిన మామిడి కాయలు, పండ్లు చలికాలం ఆరంభంలో ప్రత్యక్షం కావడం కొంత వింతే కదా. సాధారణంగా తోతాపురి (చిత్తూరు రకం) మామిడి కాయలు కాస్త ఆలస్యంగా మే చివరి నుంచి జూన్ ఆఖరు వరకు మార్కెట్లో కనిపిస్తుంటాయి. అలాంటి తోతాపురి మామిడి కాయలు నవంబరు నెలలో ఆత్మకూరు పట్టణంలో రోడ్డు కిరువైపులా తోపుడు బండ్లపై గుట్టలు గుట్టలుగా విక్రయానికి ఉంచడం కాస్త విడ్డూరంగా అనిపించింది. వ్యాపారులు ఈ కాయలను కేజీ వంద రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. వైఎస్సార్ జిల్లాలోని ఓ ప్రాంతంలో ఉన్న తోటల్లో అన్‌సీజన్‌లో ఈ కాయలు కాస్తుంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా?

కొత్తపల్లి: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. గుంతల రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. బాటసారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో సంగమేశ్వరం, కొలనుభారతి దేవి పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఈ క్షేత్రాలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివస్తుంటారు. రాకపోకలకు భక్తులు, సందర్శకులు సతమతమౌతున్నారు. కార్తీక మాసం కావడంతోవాహనాల రద్దీ పెరిగింది. ఇదేం రోడ్డురా బాబు అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు భక్తులు. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టినట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు గుప్పిస్తున్నారు. సంబధిత అధికారులు స్పందించి కనీసం రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


లింగాపురం సమీపంలో గుంతలు పడిన సంగమేశ్వరం ప్రధాన రహదారి


బావాపురం గ్రామం వద్ద గుంతలు పడడంతో నిలిచిపోయిన వాహనాలు